రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

- పెండింగ్‌లో ఉన్న రోడ్డు మరమ్మతు పనులను పూర్తి చేయండి
- గుంతలు పడిన రోడ్లను బాగు చేసేందుకు కృషి
- ఆదోని సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ
- ప్రభుత్వ స్థలాల్లో అనధికార కట్టడాలపై చర్యలు

ఆదోని రూరల్: వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించి ప్రమాదాలు జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదోని సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో డివిజన్ స్థాయి రోడ్డు సేఫ్టీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ.. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలు గురించి ఆరా తీశారు. ముఖ్యంగా డివిజన్ పరిధిలో రోడ్లపై ఉన్న గుంతలను యుద్ధ ప్రాతిపదికన పూడ్చివేసి రోడ్లను బాగు చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. పట్టణంలో వాహన పార్కింగ్ సమస్య ఉన్నందున పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు. నో పార్కింగ్ ఏరియాలో వాహనాలు నిలపకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి మాట్లాడుతూ.. ఆదోని అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా ఆక్రమణకు గురైన ప్రభుత్వ రహదారులు, భవనాలను త్వరితగతిన గుర్తించి తక్షణమే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాబో యే రోజుల్లో అధిక వర్షపాతం నమోదయ్యే సూచన ఉన్నందువల్ల లోతట్టు ప్రాంతాలను గుర్తించి అక్కడి డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచాలని, ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాంజల చెరువులో ప్రస్తుతం ఉన్న నీటిని తొలగించి, వర్షపు నీటిని ప్రతి చుక్కను సద్వినియోగం చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. కార్యాలయ పరిపాలన అధికారి సి.ఆర్.శేషయ్య, ఆదోని డీఎస్పీ శివనారాయణస్వామి, ట్రైనీ డీఎస్పీ ధీరజ్, మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, నేషనల్ హైవే ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శంకర్‌రెడ్డి, ఆర్టీఓ నాగేంద్ర, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సిసి రాదీప్తి, ఆర్టీసీ డిపో మేనేజర్ మహ్మద్‌రఫీ, పోలీసు, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ, పక్కనే ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి

విద్యాశాఖ నిబంధనలు పక్కాగా అమలుచేయాలి

ఆదోని సెంట్రల్: ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు విద్యాశాఖ నిబంధనలను పాటించే విధంగా చర్యలు చేపట్టాలని డీఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్ కోరారు. అలాగే మండల పరిధిలోని ధణాపురం గ్రామంలో ఉన్న గౌరీ గణేష్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మకు మంగళవారం వినతి పత్రం సమర్పించారు. పాఠశాలల్లో ఫీజులకు సంబంధించిన బోర్డును ఏర్పాటు చేయకుండా విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేలకు వేలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. పాఠశాలలో కనీసం విద్యార్థులు ఆడుకోవడానికి గ్రౌండ్ కూడా లేదని, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు పేరిట దోపిడీ చేస్తున్నారని వివరించారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. డీఎస్ఎఫ్ నాయకులు గోవిందరాజులు, అరవింద్ కృష్ణ, హరి మహానంది, విజయ్ తదితరులు ఉన్నారు.

మామూళ్లు వసూలు చేస్తే సహించను

ఆదోని అర్బన్: పట్టణంలో ఎవరైనా తన పేరు చెప్పి మామూళ్లు వసూలు చేయడం, దౌర్జన్యం, గూండాగిరి వంటివి చేస్తే తాట తీస్తానని ఎమ్మెల్యే పార్థసారథి హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఆర్ అండ్ బీ అతిథి గృహంలో సభ్యులతో సమావేశం జరిగింది. ముందుగా ఎమ్మెల్యే పార్థసారథికి పూలమాలలు, శాలువా వేసి సన్మానించారు. మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు కుమారుడు భూపాల్‌చౌదరి లారీ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై ఎమ్మెల్యే ఆ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అలాంటి కమిటీని ఇంకా ఏర్పాటు చేయలేదని వారు తెలపడంతో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. లారీ ఓనర్లకు ఏదైనా సమస్య వస్తే తనదృష్టికి తీసుకురావాలన్నారు. ఎవరికీ మామూళ్లు ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఎవరైనా గూండాగిరి చేయడం, మామూళ్లు అడగడం వంటివి చేస్తే తనకు తెలియజేయాలని సూచించారు. లారీ బాడుగ పెంచేసి వాటాలు తీసుకోవడం, ప్రజలను ఇబ్బంది పెట్టడం లాంటివి ఇకపై ఉండవని స్పష్టం చేశారు. నిజాయితీగా పని చేసుకోవాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌జైన్, నాయకులు ఉమ్మి సలీం, నాగరాజుగౌడ్, శ్రీనివాస ఆచారి తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

క్లుప్తంగా

పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు వెంటనే పాఠ్య పుస్తకాలను పంపిణీ చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్రబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ శేషారెడ్డికి వినతి పత్రం ఇచ్చి మాట్లాడారు. పాఠశాలలు ప్రారంభమై రెండు వారాలు గడుస్తున్నా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పూర్తి స్థాయిలో పంపిణీ చేయకపోవడం శోచనీయమన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పించి మధ్యాహ్న భోజనం సక్రమంగా అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పీడీఎస్‌యూ నాయకులు రామకృష్ణనాయుడు, నరసింహారెడ్డి, రాజు, సన్ని, నాయుడు, అబ్రెస్ పాల్గొన్నారు.

ఏఐఐబీ స్కీం పనుల పరిశీలన


మంచినీటి పథకం పనులను పరిశీలిస్తున్న ఇంజినీరింగ్ అధికారులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో మంచినీటి కోసం ఏఐఐబీ స్కీం కింద చేపడుతున్న పనులను మంగళవారం మున్సిపల్ పబ్లిక్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్ ఇంజినీరింగ్ అధికారుల బృందం పరిశీలించింది. రూ.148 కోట్లతో గాజులదిన్నె ప్రాజెక్ట్ నుంచి పట్టణానికి మంచి నీరు పంపింగ్ చేసేందుకు ఏఐఐబీ స్కీం కింద జరుగుతున్న పనుల్లో ఓవర్ హెడ్ ట్యాంక్ పనులతో పాటు ఫిల్టర్ బెడ్ల నిర్మాణాలను టెక్నికల్ అడ్వైజర్ మోహన్, ఎస్ఈ శ్రీనాథ్‌రెడ్డి, ఈఈ చంద్రమోహన్, డీఈఈలు యు.వెంకటేశ్వర్లు, జ్యోతి, ఏఈ నాగశేఖర్ పరిశీలించారు. ఆయా పనులను పూర్తి చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అప్రమత్తం


టీబీపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ఆదోని టౌన్: ప్రజలు క్షయ (టీబీ) వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ సూపర్‌వైజర్ బాబురాజు సూచించారు. ఈ మేరకు మంగళవారం ఆదోని పట్టణంలోని ఇందిరానగర్, శంకర్‌నగర్, హవన్నపేట అర్బన్ హెల్త్ సెంటర్‌లలో క్షయ నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. క్షయవ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి వివరించారు. రెండు వారాలకు మించి విపరీతమైన దగ్గు, జలుబు ఉంటే దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి గళ్ల పరీక్ష, టీబీ పరీక్ష చేయించుకోవాలన్నారు. టీబీ నిర్ధారణ అయితే ఆరు నెలలపాటు ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా మందులతో పాటు పౌష్టికాహారం కోసం నెలకు రూ.500 నగదును అందించడం జరుగుతుందన్నారు. వైద్య సిబ్బంది షేకున్‌భాను, మమేష్, బాబురాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఎన్నిక

కోసిగి: మండల ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ అధ్యక్షుడిగా చింతకుంట సామేల్, అధికార ప్రతినిధిగా వందగల్లు నరసింహులు, ప్రధాన కార్యదర్శిగా చిదానంద, ఉపాధ్యక్షులు ప్రకాష్, ఈరన్నలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం స్థానిక ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి పోగు భాస్కర్ మాదిగ, సుభాస్ చంద్ర ఆధ్వర్యంలో వారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ సారథ్యంలో హక్కుల సాధనకు ఉద్యమిస్తామని పేర్కొన్నారు. కొత్తగా ఏర్పాటు చేసి కమిటీ సభ్యులుగా హనుమంతు, నరసింహులు, తిక్కస్వామి, నరసయ్య, లింగమూర్తి, రుద్రమునిలను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం తాలుకా కార్యదర్శి చింతకుంట నాగరాజు, జిల్లా నాయకులు మనోజ్, దుర్గప్ప, ఎంఎస్‌పీ సీనియర్ నాయకులు కోడి ఉరుకుంద తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికి సీటు కేటాయించాలి

ఆదోని సెంట్రల్: దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి సంక్షేమ వసతి గృహాల్లో సీటు కేటాయించాలని రాయలసీమ అభ్యుదయ విద్యార్థి ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణ, ఖాజా కోరారు. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ.. ఆదోని డివిజన్‌లో నిరుపేద కుటుంబాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. బతుకుదెరువు కోసం వలసలు వెళుతుంటారన్నారు. పిల్లలను చదివించడానికి సరైన వసతి లేక మధ్యలోనే చదువులను ఆపేస్తున్నారని, అలాంటి వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అధికారులు ప్రతి విద్యార్థికి వసతి గృహంలో సీటు కల్పించాలన్నారు. అలాగే వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఆర్ఏవీఎఫ్ నాయకులు ఉషారాణి, పర్వీన్, ఆదిలక్ష్మి, శిల్ప తదితరులు పాల్గొన్నారు.

బాలికల హక్కులను పరిరక్షించాలి

ఎమ్మిగనూరురూరల్: బాల్య వివాహాలను అరికట్టి, బాలికల హక్కులను పరిరక్షించడం మనందరి బాధ్యత అని తహసీల్దార్ శేషారెడ్డి, జిల్లా బాలల హక్కుల పర్యవేక్షణ అధికారిణి శారద, సీడీపీఓ సఫర్నీసాబేగం పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాలికలకు చిన్న వయస్సులో వివాహం చేస్తే అనారోగ్య సమస్యలతో పాటు ఇతర సమస్యలు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. 18 ఏళ్లు నిండిన తరువాత పెళ్లి చేయాలని సూచించారు. బాల్య వివాహాలు చేస్తే రెండు సంవత్సరాలు జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధించే అవకాశం ఉందన్నారు. ఎక్కడైనా బాల్య వివాహం చేస్తున్నట్లు తెలిస్తే బాలికల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పెళ్లిని నిలువరించాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్లు, మహిళా పోలీసులు బాల్య వివాహాలపై వెంటనే పైస్థాయి అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. బాల్య వివాహాలను అరికట్టడంపై ప్రతిజ్ఞ చేయించి, పోస్టర్లను విడుదల చేశారు. సూపరింటెండెంట్ అనసూయమ్మ, జిల్లా సోషల్‌వర్కర్ నరసింహులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, మహిళా పోలీసులు, హెల్త్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్లను విడుదల చేస్తున్న తహసీల్దార్ శేషారెడ్డి, డీసీపీఓ శారద, సీడీపీఓ సఫర్నీసాబేగం

ఆకర్షణకు లోనుకావొద్దు

బాలికలు ఆకర్షణకు గురికాకుండా ఉండాలని ప్రిన్సిపాల్ స్వర్ణలత, డీసీపీఓ శారద సూచించారు. మంగళవారం సాయంత్రం మండల పరిధిలోని బనవాసి ఏపీ గురుకుల పాఠశాలలో బాల్య వివాహాల నిర్మూలన, హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాలికలు కొత్త వ్యక్తుల మాయమాటలు నమ్మి మోసపోవద్దని, ట్రాప్‌లో పడవద్దని సూచించారు. బాలికల హక్కులను గుర్తించుకోవాలని చెప్పారు. బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే పైస్థాయి అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. జిల్లా సోషల్ వర్కర్ నరసింహులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, పాఠశాల అధ్యాపక బృందం, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నివారణపై నేడు ర్యాలీ

ఎమ్మిగనూరురూరల్: అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పట్టణంలో బుధవారం ఉదయం 9 గంటలకు అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు సెబ్ సీఐ భార్గవరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని వీవర్స్ కాలనీ నుంచి సోమప్ప సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు.

హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలి

ఆదోని సెంట్రల్: ఆదోని నియోజకవర్గంలో ప్రభుత్వ వసతి గృహాలకు సొంత భవనాలను నిర్మించాలని పీడీఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి కె.సోమశేఖర్, బీడీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ పి.రమేష్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథిని కలసి వినతి పత్రం సమర్పించారు. వారు మట్లాడుతూ.. అరకొర వసతులతో కూడిన అద్దె భవనాల్లో వసతి గృహాలను నిర్వహిస్తుండడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. వసతి గృహాల్లో సరైన సౌకర్యాలు లేక అనేక మంది విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని తెలిపారు. ఇక ప్రాథమిక స్థాయిలో చదువుతున్న విద్యార్థుల వసతి గృహాలు శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. వీటికి మరమ్మతులు చేపట్టి కనీస సౌకర్యాలను కల్పించాలని కోరారు. ఇప్పటికైనా నాబడుగు బలహీన వర్గాల వారిని దృష్టిలో ఉంచుకొని అన్ని వసతులతో కూడిన సంక్షేమ వసతి గృహాలను ఏర్పాటు చేయాలన్నారు. పీడీఎస్‌యూ, బీడీఎస్ఎఫ్ నాయకులు పవన్, సాయి, తేజ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు వీల్‌చైర్ల పంపిణీ

ఆదోని రూరల్: ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అని, అవసరార్థులకు సాయం చేయడంలోనే మనం చేస్తున్న సేవకు పరిపూర్ణత కలుగుతుందని ఫాదర్ సురేష్, ఆదోని బాలయేసు ప్రార్థన మందిరం ఫాదర్ డీన్ కోలా విజయరాజు పేర్కొన్నారు. మంగళవారం ఆదోని, పెద్దకడబూరు మండలాల్లోని పూర్తిగా నడవలేని స్థితిలో ఉన్న 10 మంది దివ్యాంగులకు వీల్‌చైర్లను ఉచితంగా అందించారు. వీరితో పాటు వంద మంది నిరుపేదలకు ఒక్కొక్కరికీ రెండు కేజీల బియ్యం, కేజీ కంది బ్యాళ్లు, లీటర్ మంచి నూనె, సబ్బులు, పిల్లలకు బిస్కెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇతరులకు సాయం అందించడం మన జీవితంలో ఒక భాగమని చెప్పారు. ప్రతిఒక్కరూ సేవాభాగంతో మెలగాలని పిలుపునిచ్చారు.


వీల్ చైర్లను పంపిణీ చేస్తున్న ఫాదర్లు సురేష్, కోలా విజయరాజు

ఆదోని ఎంఈఓలు రాజేంద్రప్రసాద్, శ్రీనివాసులతో పాటు పెద్దకడబూరు ఎంఈఓ సువర్ణ, బాలయేసు ప్రార్థన మందిరం సంఘం పెద్దలు నవీన్, స్టీఫెన్, సహిత ఉద్యోగులు శాంతిరాజ్, సుబ్బరాయుడు, మౌనిక, ఇమ్మానుయేల్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి


అభిలాష్‌కుమార్ (ఫైల్)

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని కలుగోట్ల రోడ్డు ఉసేనప్ప కొట్టాలలో నివాసముంటున్న అభిలాష్‌కుమార్ (44) మంగళవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. మంత్రాలయం మండలం తుంగభద్రకు చెందిన అభిలాష్ చాల సంవత్సరాలుగా పట్టణంలోనే నివాసముంటున్నాడు. ఉదయం ఇంటి వద్ద ఉన్నట్లుండి కుప్పకూలడంతో కుటుంబ సభ్యులు చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

యాజమాన్య పద్ధతులతో పైర్లకు మేలు


వర్మీకంపోస్ట్, లిక్విడ్ ట్రైకోడెర్మాతో కలుపుకునే విధానాన్ని వివరిస్తున్న సిబ్బంది

పెద్దకడబూరు: పంటల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు, నాణ్యమైన ఉత్పత్తులు పండించవచ్చని వ్యవసాయ సహాయకులు మహేష్, ఉద్యాన సహాయకులు నాయక్, ఆర్డిప్ స్వచ్ఛంద సంస్థ కార్యకర్త కరుణప్ప సూచించారు. మండల పరిధిలోని హెచ్.మురవణి గ్రామంలో మంగళవారం వాతావరణ అనుకూల వ్యవసాయ పద్ధతులపై వ్యవసాయ శాఖ, రిలయన్స్ ఫౌండేషన్, ఆర్డిప్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. ఆ గ్రామ రైతు ఉప్పర గోవిందు పొలంలో పత్తి విత్తనాలు నాటుకునేటప్పుడు బోదల్లో వర్మీ కంపోస్ట్ లిక్విడ్ ట్రైకోడెర్మాతో కలిపి వేసుకోవడం ద్వారా మొలక దశ నుంచి భూమి నుంచి సోకే తెగుళ్లను నివారించవచ్చునని సూచిస్తూ మిశ్రమం కలుపుకునే విధానాన్ని ప్రయోగాత్మకంగా చూపించారు. రైతులు పాల్గొన్నారు.

మోటార్ అపహరణ

కోసిగి: స్థానిక భూగేని చెరువు సమీపంలో సంప్ వద్ద తాగునీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన 10 హెచ్‌పీ మోటార్‌ను సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు అపహరించినట్లు కోసిగి పంచాయతీ కార్యదర్శి ఎం.తిరుమలేశ్వర రెడ్డి తెలిపారు. మంగళవారం ఉదయం వాటర్‌మెన్‌లు నీటిని సరఫరా చేసేందుకు వెళ్లి చూడగా మోటార్ కనిపించకపోవడంతో సర్పంచ్ అయ్యమ్మకు, ఈఓ తిరుమలేశ్వ రెడ్డికి తెలియజేశారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి అనంతరం కోసిగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మోటార్ చోరీకి గురికావడంతో కోసిగి ప్రాంతానికి తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడింది. అలాగే మే 3వ తేదీన పులికనుమ రిజర్వాయర్ వద్ద ఉన్న 5 బోర్లకు సంబంధించిన విద్యుత్ కేబుల్ వైర్లు దొంగిలించారని, ఇప్పుడు మోటార్ ఎత్తుకెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. చోరీకి పాల్పడుతున్న వారిని పట్టుకుని కఠినంగా శిక్షించాలని కోరారు.

అవినీతిని అరికట్టాలి

ఆదోని రూరల్: హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీ కరప్షన్ అసోసియేషన్ అవగాహన సదస్సు మంగళవారం ఆ సంఘం ఆదోని నియోజకవర్గ సభ్యులు గుమ్మల బాలస్వామి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీ కరప్షన్ అసోసియేషన్ కర్నూలు జిల్లా చైర్మన్ శ్రీకాంత్ పాల్గొన్నారు. అవినీతి, అక్రమాలను రూపుమాపేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం హ్యూమన్ రైట్స్ టీమ్‌లో చేరే వారికి ఐడీ కార్డులు, జాయినింగ్ లెటర్ అందజేశారు. ఆదోని హ్యూమన్ రైట్స్ సభ్యులు కృష్ణ, జె.శ్రీకాంత్, కె.ప్రసాద్, మహానంది, ఎల్.గణేష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీ కరప్షన్ అసోసియేషన్ కర్నూలు జిల్లా చైర్మన్ శ్రీకాంత్

రైలు కింద పడి యువతి ఆత్మహత్య

ఆదోని సెంట్రల్: ఆదోని-నగరూరు రైల్వేస్టేషన్ల మధ్య కి.మీ. నంబర్ 493/10 డౌన్ లైన్ రైల్వే ట్రాక్‌పై రైలు నంబర్ 22158 కింద పడి ఓ యువతి మంగళవారం ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్‌ఐ గోపాల్ తెలిపారు. యువతి లైట్ రెడ్ కలర్ లెగ్గిన్స్, బ్లూ రంగు డాట్స్ బోర్డర్ గల గులాబీరంగు టాప్ ధరించి ఉందని, యువతి వయస్సు 30 సంవత్సరాలు ఉండొచ్చని చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు 98491 57634 నంబర్‌ను సంప్రదించాలని రైల్వే ఎస్‌ఐ చెప్పారు. కేసు నమోదు చేసుకుని, యువతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి పంపుతున్నట్లు చెప్పారు.

11 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

ఆదోని అర్బన్: పట్టణంలోని ఎస్‌కేడీ కాలనీలో ఉన్న ఏపీ ఎన్జీవో భవన్‌లో మంగళవారం పేకాట ఆడుతున్న 11 మందిని అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ గోపి తెలిపారు. పక్కా సమాచారం మేరకు ఎస్‌ఐ కె.సి.తిరుపాల్, పోలీసు సిబ్బందితో కలిసి దాడులు చేయడం జరిగిందన్నారు. అక్కడున్న వారిని విచారించగా యాసిన్ అనే వ్యక్తి పేకాట ఆడిస్తున్నాడని చెప్పారన్నారు. పెద్ద మనుషుల సమక్షంలో సోదా చేసి వారి వద్ద నుంచి రూ.14,450 నగదును స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

ఆలయ ధర్మకర్తకు సన్మానం


జిందే శంకర్‌ను సన్మానిస్తున్న సభ్యులు

ఆదోని అర్బన్: అంభాభవానీ దేవాలయ ధర్మకర్తగా ప్రమాణస్వీకారం చేసిన జిందే శంకర్‌ను సోమవారం స్థానిక ఆలయంలో సమాజం బంధువులు సన్మానించారు. ధర్మకర్త శంకర్ మాట్లాడుతూ.. దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తానని, ఆలయంలో జరిగే కార్యక్రమాలకు అందరూ సహకరించాలని కోరారు. ఆలయ కమిటీ సభ్యులు, సమాజ్ బంధువులు జిందేసాయి గోవిందరాజు, జిందే ప్రకాష్, వై.పి.పాండురంగారావు, శ్రీకాంత్, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సుందరీకరణ పనుల పరిశీలన


అన్నమయ్య సర్కిల్‌లో పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని అన్నమయ్య సర్కిల్‌లో చేపడుతున్న సుందరీకరణ పనులను మంగళవారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పరిశీలించారు. సర్కిల్‌లో మొక్కలు, పచ్చదనంతో పాటు గ్రిల్ ఏర్పాటు, 'ఐ లవ్ ఎమ్మిగనూరు' అన్న అక్షర కూర్పు ఏర్పాటు తదితర పనులను పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలిచ్చారు. మొక్కలను సంరక్షించేందుకు గాను నీటి సౌకర్యం ఏర్పాటుపై సిబ్బందికి ఆదేశాలిచ్చారు. మున్సిపల్ డీఈ నీరజ, ఏఈ మదన్ తదితరులు ఉన్నారు.

డయేరియా నివారణకు చర్యలు

గోనెగండ్ల: ప్రస్తుత వర్షాకాలంలో డయేరియా వ్యాధి సోకే అవకాశాలున్నాయని, వ్యాధి నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఈఓఆర్డీ నాగేష్ సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో మండల అభివృద్ధి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎం, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఆయా శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలలో ఎప్పటికప్పుడు వాటర్ ట్యాంకులను శుభ్రపరచాలని, ట్యాంకుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లి, పరిశుభ్రమైన నీటిని సరఫరా చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ సిబ్బందికి సూచించారు. అలాగే ప్రజలు తమ ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ రుక్సానా, పంచాయతీ కార్యదర్శులు సతీష్, వెంకటేశ్వర్లు, బైలుప్పల వెంకటేష్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఈఓఆర్డీ నాగేష్

తాగునీటి చెరువుల పరిశీలన

ఆదోని టౌన్: ఆదోని పట్టణానికి తాగునీటిని అందించే రాంజల నల్లచెరువు, బసాపురం ఎస్ఎస్ ట్యాంకును మంగళవారం సాయంత్రం మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, ఎంఈ చలపతిరావు, ఏఈలు తనిఖీలు చేశారు. ముఖ్యంగా రాంజల చెరువులో పాచిపట్టి కంపువాసన వెదజల్లుతూ, రంగుమారిన నీటిని కమిషనర్, ఎంఈ పరిశీలించారు. రంగుమారిన నీటిని వీలైనంత త్వరగా బయటకు పంపింగ్ చేయాలన్నారు. తర్వాత తుంగభద్ర జలాశయం నుంచి వచ్చే నీటిని చెరువులో నింపుకోవాలన్నారు. పట్టణంలో తాగునీటి కొరత లేకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ తెలిపారు. బసాపురం ఎస్ఎస్ ట్యాంకులో జరిగిన చెరువు గట్టు పనులను పరిశీలించారు. చెరువులో ఉన్న నీటిని రోజూ పంపింగ్ చేస్తే ఎన్ని రోజులకు సరిపడతాయనే అంశాలపై పరిశీలన చేశారు. తుంగభద్ర దిగువ కాలువకు హొస్పేట డ్యాం నుంచి నీరు విడుదలయ్యేంత వరకు నీటిని పొదుపుగా వాడుకుందామని, అందుకు ప్రజలు సహకరించాలని కమిషనర్ కోరారు.


రాంజల చెరువులో రా వాటర్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ ఎంఈ, ఏఈలు

వైభవంగా జయతీర్థుల మహితోత్సవం


అశేష జనావాహిని మధ్య జయతీర్థుల రథోత్సవం


వేడుకను తిలకిస్తున్న భక్తులు

మంత్రాలయం: మధ్వమత పూర్వపు పీఠాధిపతి జయతీర్థుల మహితోత్సవం వేడుకలు వైభవంగా జరిగాయి. మంగళవారం శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల నేతృత్వంలో మహితోత్సవం వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. కర్ణాటకలోని నవ బృందావన క్షేత్రంలో బృందావనస్థులైన పద్మనాభతీర్థుల మూల బృందావనానికి జయతీర్థులు శ్రీమన్యాయసుధా గ్రంథాన్ని సమర్పించిన దినాన్ని పురస్కరించుకుని జయతీర్థుల మహితోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా మంగళవారం జయతీర్థుల చిత్రపటానికి ఊంజల మండపంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం బంగారు రథంపై జయతీర్థుల చిత్రపటాన్ని ఉంచి అంగరంగ వైభవంగా ఊరేగించారు. శ్రీమఠం ప్రాంగణంలో రథోత్సవం కనుల పండువగా సాగింది. అనంతరం ఊంజల మండపం వేదికపై పీఠాధిపతి ప్రవచనాలు గావించారు. జయతీర్థుల మహితోత్సవం విశిష్టతను భక్తులకు వివరించారు.

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి


సూచనలు చేస్తున్న అధికారులు

కౌతాళం: ప్రస్తుతం వాతవరణంలో వస్తున్న మార్పులు, వర్షాల వల్ల డయేరియా కేసులు నమోదు కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ రఘునాథ్‌గుప్తా, వైద్యాధికారి ఇమ్మానుయేల్ సూచించారు. జిల్లా ఉన్నతధికారుల ఆదేశాల మేరకు మంగళవారం డయేరియా నివారణపై మండల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో నీటి ట్యాంకులను ఏప్పటికప్పుడు శుభ్రం చేసి తగిన మోతాదులో బ్లీచింగ్ పౌడర్‌ను కలిపి క్లోరినేషన్ చేయాలన్నారు. డైరెక్ట్ పంపింగ్ ద్వారా నీటిని సరఫరా చేయరాదని, ఎప్పటికప్పుడు డ్రైనేజీల్లో చెత్తచెదారంను తొలగించాలని కార్యదర్శులు, సర్పంచులను ఆదేశించారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలని, దీనిపై ప్రజలకు అవగహన కల్పించాలన్నారు. కార్యదర్శులు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

విద్యా వ్యాపారాన్ని అరికట్టాలి

ఎమ్మిగనూరుటౌన్: ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో విద్యా వ్యాపారాన్ని అరికట్టాలని జైభీమ్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు చిక్కం జానయ్య డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ జీఓ 53, సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా ఎమ్మిగనూరు పట్టణంలోని పలు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో నర్సరీ, ఫస్ట్‌క్లాస్‌లో ప్రవేశాలకు రూ.25 వేల నుంచి రూ.35 వేల వరకు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వసూలు చేస్తూ యాజమాన్యాలు దోపిడీ చేస్తున్నట్లు ఆరోపించారు. ఫీజు వివరాల బోర్డులను పాఠశాలల్లో ఏర్పాటు చేయడం లేదన్నారు. దీనిపై విద్యాశాఖ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని వాపోయారు. ఇప్పటికైనా నిబంధనలు పాటించని పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో జైభీమ్ ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రశాంత్‌కుమార్, ఎర్రన్న, నరసింహ, దినకర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జైభీమ్ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు చిక్కం జానయ్య